నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 31 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

ముగిసిన పది పరీక్షలు

- వచ్చే నెల 3 నుంచి మూల్యాంకనం

సూర్యాపేటలో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

రామగిరి, మార్చి 30: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు జిల్లావ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులేల్లేకుండా ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. చివరి రోజు పరీక్షలు ముగిసిన తర్వాత విద్యార్థులు పరీక్ష కేంద్రీ వెలుపల తమ స్నేహితులతో కలిసి సంతోషం పంచుకున్నారు. హాస్టల్ విద్యార్థులు సామాన్లతో ఇంటి బాట పట్టారు. బస్టాండ్లు, పాఠశాలలు, హాస్టల్స్ వద్ద సందడి కనిపించింది.

అన్నదాతకు అండగా సర్కారుపై సమరం

సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో నేడు కేసీఆర్ పర్యటన



- తుంగుతుర్తి, సూర్యాపేట మీదుగా నిడమనూరు వరకు
- ఎండిన పంటల పరిశీలన, రైతులతో ముఖాముఖి
- సూర్యాపేటలో మీడియా సమావేశం
- రైతుల కష్టాలు, పంట నష్టం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై స్పందించనున్న కేసీఆర్

నల్లగొండ ప్రతినిధి/సూర్యాపేట మార్చి 30 (నమస్తే తెలంగాణ) : పదేండ్లు ఏ చింతా లేకుండా వ్యవసాయం చేసిన రైతన్నను వంద రోజుల కాంగ్రెస్ పాలన కష్టాల సుడిగుండంలోకి నెట్టింది. నీళ్లిచ్చే అవకాశం ఉన్నా ఆలోచన చేయకుండా పచ్చటి పొలాలను ఎండబెట్టింది. కండ్ల ముందే కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు ఎండిపోతుంటే దిక్కులేని స్థితిలోకి నెట్టింది. అండగా నిలువాల్సిన ప్రభుత్వం చేతులెత్తేస్తే.. రైతు బాంధవుడు, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి వరకు ఎండిన పొలాలను పరిశీలించి, రైతుల కష్టాలను తెలుసుకుని, అండగా నిలిచేందుకు పర్యటనకు సిద్ధమయ్యారు. జనగామ జిల్లా నుంచి ఉదయం 11.30 గంటలకు తుంగతుర్తి నియోజకవర్గానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి సూర్యాపేట వరకు మార్గ మధ్యంలో ఎండిన పొలాలను పరిశీలించనున్నారు. రైతులతో మమేకం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సూర్యాపేటలో తన పరిశీలనలోని అంశాలతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యంపై మీడియా సమావేశంలో కేసీఆర్ స్పందించనున్నారు. సాయంత్రం 4.30గంటలకు నిడమనూరుకు చేరుకుని సాగర్ ఆయకట్టులో ఎండిన పంటలను పరిశీలిస్తారు. 6 గంటలకు తిరుగుప్రయాణమై రాత్రి 9గంటలకు తిరిగి ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌కు చేరుకోనున్నారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ పర్యటన సజావుగా సాగేలా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యులు కలిసి ప్రణాళిక సిద్ధం చేశారు. కేసీఆర్ రాక కోసం ఉమ్మడి జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారని, తమ బాధలు చెప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నారని జగదీశ్‌రెడ్డి చెప్పారు.

పచ్చని వ్యవసాయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన కండ్ల ముందే రైతులు ఇబ్బందులు పడుతుంటే చలించారు. అందుకే క్షేత్రస్థాయిలో స్వయంగా రైతులతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని భావించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగిలో రైతులను కష్టాలు చుట్టుముట్టాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ సమయంలో అటు కాళేశ్వరం ఇటు సాగర్ నుంచి సాగునీటి కోసం రైతులు ఆశగా ఎదురుచూశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆశలను వమ్ము చేసింది. నీళ్లిచ్చే వైపున కనీస ఆలోచన కూడా చేయలేదు. పైగా గత పాలకులపై నెపం నెట్టేందుకు ప్రయత్నిస్తూ రైతును గాలికి వదిలేసింది. దాంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3లక్షల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. పండ్ల తోటలు సైతం తుడిచి పెట్టుకుపోయాయి. దాంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు వేలాది బోర్లను తవ్వారు. అయినా ఫలితం లేక రెండు విధాలుగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌తోపాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్క రోజు కూడా దీనిపై సమీక్ష చేసిన దాఖలాలు లేవు. జిల్లా మీదుగా ఖమ్మానికి నీటిని తరలించుకుపోయి పంటలను కాపాడుకుంటున్నా వీరికి జిల్లా రైతాంగం పట్టలేదు. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులు రంగంలోకి దిగాయి. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. పంటలను పరిశీలిస్తూ రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. జిల్లావ్యాప్త పరిస్థితులను ఎప్పటికప్పుడు పార్టీ అధినేత కేసీఆర్‌కు జగదీశ్‌రెడ్డి తెలియజేశారు. దాంతో చలించిన కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఉదయం 8.30గంటలకు ఎర్రవెల్లిలోని ఫాంహౌస్ నుంచి ఆయన పర్యటన ప్రారంభం కానున్నది.

తుంగతుర్తి నుంచి...

ఉదయం 8.30గంటలకు ఎర్రవెల్లి నుంచి కేసీఆర్ బయల్దేరి 10.30గంటల వరకు జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్‌తండాకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పొలాలతో పాటు రైతులతో భేటీ అవుతారు. ఉదయం 11.30గంటలకు సూర్యాపేట జిల్లా పరిధిలోని తుంగతుర్తి మండలంలోకి ప్రవేశిస్తారు. తుంగతుర్తితో పాటు అర్వపల్లి, సూర్యాపేట మండలంలో ఎండిన పంటలను పరిశీలిస్తూ మధ్యాహ్నం 1.30గంటలకు జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి 3గంటలకు సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 3.30గంటలకు అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.30గంటల వరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నిడమనూరుకు చేరుకుంటారు. అక్కడ పంటల పరిశీలన, రైతులతో ముచ్చటించిన అనంతరం సాయంత్రం ఆరు గంటలకు పయనం అవుతారు. నల్లగొండ మీదుగా తిరిగి రాత్రి 9గంటల వరకు ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు చేరుకోనున్నారు.

రేపు నల్లగొండకు కేటీఆర్

- బీఆర్ఎస్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏప్రిల్ ఒకటిన నల్లగొండకు రానున్నారు. జిల్లాకేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు తరలిరానున్నారు. సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార ఎజెండా, అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలను, ప్రభుత్వ మోసాలను, కరువు తదితర పరిస్థితులను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్చించనున్నారు. నల్లగొండ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ ముఖ్యులంతా ఈ సమావేశంలో పాల్గొనేలా ఆహ్వానించారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. కృష్ణారెడ్డి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలిసి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. నల్లగొండ సమావేశం అనంతరం ప్రచార షెడ్యూల్ రూపొందించుకుని విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి

రైతులకు భరోసాగానే కేసీఆర్ పర్యటన

- సాగర్ డెడ్‌స్టోరేజీలోనూ సాగుకు నీరిచ్చిన బీఆర్ఎస్ సర్కారు
- నేడు పంటలు ఎండుతుంటే చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సీఎం, మంత్రులకు వసూళ్లపైనే వ్యామోహం
- సన్న వడ్లకు కనీస ధర కూడా దక్కడం లేదు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 30 : 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా సాగు నీరు లేదు. రైతు బంధు రాలేదు. ధాన్యానికి బోనస్ అందలేదు. పంటలు ఎండుతున్నా నష్ట పరిహారం ఇవ్వాలన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదు. సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని రైతులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మొర పెట్టుకోవటంతో రైతులకు అండగా ఉండి భరోసా కల్పించేందుకు కేసీఆర్ రంగంలోకి దిగారు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆయన నడవలేని పరిస్థితుల్లో ఉన్నా రైతుల కోసం కర్ర సాయంతో ఉమ్మడి జిల్లాలో పర్యటించడానికి వస్తున్నారని తెలిపారు. భువనగిరి, జనగాం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించి ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు చెప్పారు. శనివారం నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వసూళ్ల వ్యామోహంలో పడి ప్రజా పాలనను గాలికి వదిలేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే సోయి లేకుండా పార్టీలో చేరికకు గేట్లు తెరుస్తామని మాట్లాడుతున్నారని, ముందు ప్రాజెక్టుల గేట్లు తెరిచి పంటలకు నీళ్లివ్వాలని అన్నారు. నాడు సాగర్‌లో ఇంతకన్న తక్కువ స్థాయిలో నీళ్లున్నా అధికారుల సలహాతో జిల్లాలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా కేసీఆర్ సర్కారు నీళ్లిచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జిల్లాలో నీటి పారుదల శాఖ మంత్రి ఉన్నా పంటలు ఎండుతుంటే పట్టించుకోవడం లేదని, పోలీస్ పహారాలో 12 రోజుల పాటు పాలేరుకు నీటినా తరలిస్తే ఏంచేశారని ప్రశ్నించారు. పంతానికి పోయి నాటి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కాళేశ్వరం ఆయకట్టుకు నీళ్లివడం లేదని మండిపడ్డారు. మూడు నెలల్లో కాళేశ్వరం ద్వారా వంద టీఎంసీల నీరు తీసుకునే అవకాశం ఉన్నా సర్కార్ చేతగాని తనం వల్ల ఒక్క టీఎంసీ కూడా తీసుకోలేకపోయామని తెలిపారు. కనీసం రెండు తడులు ఇచ్చినా బయ్యన్నవాగు నుంచి మోతె వరకు ఒక్క ఎకరం కూడా ఎండిపోయేది కాదన్నారు. వ్యవసాయ రంగంపై సోయి లేని రేవంత్‌కు లోపల ఆదర్శం చంద్రబాబు అయితే బయట మోడీ అన్నారు. నాడు చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే, నేడు మోదీ రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతుల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రజా వ్యతిరేకమైన పాలనను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు.

కోమటిరెడ్డి చెప్పినా ఒక్కమిల్లు కూడా సీజ్ కాలేదేం

జిల్లాలో సన్న ధాన్యం పండిస్తున్న రైతులు నష్టపోవద్దని ఏడెనిమిదేండ్ల నుంచి మిల్లర్లతో మాట్లాడి కింటాకు రూ.2,700 దాకా ధర ఇప్పిస్తే ఈసారి రూ.2,200కి మించి ఎందుకు ఇవ్వలేదని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. మిల్లర్లు, కాంట్రాక్టర్లు, క్రషర్లు, ఆఖరికి ఇంటి నిర్మాణాలు చేపడుతన్న వారి దగ్గరా అక్రమ వసూళ్లకు పాల్పడి రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిల్లర్ల దగ్గర రెండు కోట్ల దాకా వసూలు చేస్తే రైతుకు ఎలా మంచి ధర ఇస్తారని ప్రశ్నించారు. తక్కువ ధర ఇచ్చిన మిల్లులను సీజ్ చేయాలని మంత్రి చెప్పినా ఇప్పటి వరకూ ఒక్క మిల్లూ సీజ్ కాలేదని పైగా ధాన్యం ధర వంద రూపాయలు తగ్గిందని ఎద్దేవా చేశారు.

ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలి : ఎంపీ బడుగుల

పంట నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని రాజ్య సభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మొదటి నుండి రైతుల పక్షానే ఉంటుందని, ఇవ్వాల బీఆర్ఎస్ అధికారంలో లేనందున రైతులకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా రైతులకు భరోసా ఇవ్వడానికి కేసీఆర్ వస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నేతలు తండు సైదులు గౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి రెడ్డి, చీర పంకజ్ యాదవ్, ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున, జనార్దన్‌రావు, గోవర్దన్, కోటేశ్ పాల్గొన్నారు.

నీళ్లులేక నెర్రెలు బారిన నేల

- చేతికందే సమయంలో ఎండిన వరి

రాజాపేట, మార్చి 30 : రాజాపేట మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన మూల మల్లారెడ్డి ఐదెకరాల్లో రెండు బోర్ల కింద లక్ష రూపాయల పెట్టుబడి పెట్టి వరిసాగు చేశాడు. గ్రామంలోని చెరువుల్లో నీరు లేక రెండు బోర్లలో నీళ్లు పూర్తిగా అడుగంటాయి. మరో 15 రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వరి చేను పూర్తిగా ఎండిపోయింది. దాంతో పంటను పశువుల మేతకు వదిలేశాడు.

జీవాలకు మేత..

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూర్.ఎం మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి రంగారెడ్డి తనకున్న ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. బోర్లలో నీరు అడుగంటడంతో 4 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. దాంతో పంటను గొర్రెల మేతకు వదిలేశాడు. నాలుగు తడులు అయితే పంట చేతికి వచ్చేదని రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కరువు తాండవం

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న క్షామం

- 25వేల ఎకరాల్లో ఎండిన పంటలు
- ఎక్కడ చూసినా నెర్రెలుబారిన నేలలు
- నీళ్లు లేక పశుగ్రాసంగా మారుతున్న పంట
- పదేండ్ల తర్వాత రైతన్నకు గడ్డు పరిస్థితులు
- కనీసం పట్టించుకోని రాష్ట్ర సర్కారు

భూమికి పచ్చని రంగేసినట్లు పొలాలు.. పుట్లకు పుట్లు ధాన్యం.. సకాలంలో కొనుగోళ్లు.. సర్కారు మద్దతు ధర.. చేతినిండా డబ్బులు.. రైతుల కండ్లల్లో ఆనందం.. ఇవి గత యాసంగి సీజన్‌లో కనిపించిన దృశ్యాలు.. కానీ, ఈ సారి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎక్కడ చూసినా వట్టిపోయిన బోర్లు, బావులు.. నెర్రెలు బారిన నేలలు.. పాట్ట మీద ఎండుతున్న పొలాలు.. కర్షకుల కండ్లలో కన్నీరు.. ఇదీ జిల్లాలో ఇప్పుడున్న క్షామ పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం అన్నదాతను మరింత కుంగ దీస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, మార్చి 30 (నమస్తే తెలంగాణ)

25వేల ఎకరాల్లో ఎండిన పంటలు..

జిల్లాలో కరువు తాండవిస్తున్నది. దశాబ్ద కాలంగా సిరిసంపదలతో వెలుగొందిన చోట కరువు ఛాయలు పెరిగిపోతున్నాయి. సాగుకు సరిపడా నీళ్లు లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. కొద్దిమంది రైతులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా నీరు సరిపోక పొట్ట దశలో పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మొత్తం 2.93 లక్షల ఎకరాలు వరి పంటలు సాగు చేయగా, అందులో సుమారు 25వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు అంచనా. ప్రధానంగా సంస్థాన్‌నారాయణపురం, భువనగిరి, వలిగొండ, గుండాల, తుర్కపల్లి, రాజాపేటతోపాటు పలు మండలాల్లో పంటలు ఆగమయ్యాయి. నీళ్లు లేపోవడంతో నేలలు నెర్రెలు బారుతున్నాయి. పంట మొత్తం ఎండు గడ్డిలా మారుతున్నది. దాంతో పశువులు, జీవాలను మేపుతున్నారు.

లక్షల ఖర్చుతో బోర్లు వేస్తున్నా.. చుక్క నీరు పడుతలే..

జిల్లాలో కొన్నేండ్ల నుంచి భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఏటా గంగమ్మ పైకి ఉబికివచ్చింది. నాలుగు నుంచి ఐదు మీటర్ల లోతులో నీటి మట్టం ఉండేది. ఈ ఏడాది వివిధ కారణాలతో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. ఫిబ్రవరిలో జిల్లాలో సగటున 8.59మీటర్ల లోతులో నీళ్లున్నాయి. గతేడాది ఇదే నెలలో 6.06 మీటర్ల మట్టంలో నీళ్లు ఉండగా, ఈ ఏడాది 2.53మీటర్ల కిందికి ఇంకిపోయాయి. భూగర్భజలాలు ఇంకిపోతుడడంతో నీటి మట్టం తగ్గిపోతున్నది. దాంతో నీళ్లు లేక బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ఇంతకాలం పుష్కలంగా నీళ్లు ఉండటంతో బాగా నీళ్లు పోసిన బోర్లన్నీ ఎండిపోతున్నాయి. రైతులు లక్షల్లో ఖర్చు పెట్టి బోర్లు వేస్తున్నా చుక్క నీరు పడడం లేదు. దాంతో కొన్ని చోట్ల రైతులు వాటర్ ట్యాంకర్లతో నీళ్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు వెయ్యి రూపాయల వరకు ఖర్చు అవుతున్నది.

ఎకరాకు రూ.33వేల నష్టం..

రైతులు వరి సాగుకు సుమారుగా ఒక్కో ఎకరానికి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు దాదాపు 28 కింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. కింటాకు రూ. 2వేలు అనుకున్నా రూ.58వేలు. ఎకరం భూమి నుంచి సరిగ్గా పంట దిగుబడి వస్తే.. పెట్టుబడి పోను రూ.33వేలు మిగులుతుంది. ఇప్పుడు పంటలు ఎండిపోవడంతో ఎకరానికి 33వేల దాకా నష్టం వాటిల్లిన పరిస్థితి. మరోవైపు రైతు బంధు కూడా ఈసారి సకాలంలో అందలేదు. ఇప్పటికీ 25 శాతం మందికి డబ్బు జమ కాలేదు.

సర్కారు పట్టించుకుంటలేదు

యాసంగిలో రెండెకరాల్లో వరి సాగు చేసినం. పంట ఏపుగా పెరిగి పొట్టదశకు వస్తున్న క్రమంలో బోర్లు ఎండిపోయి ఎకరన్నర వరి చేను ఎండిపోయింది. కండ్ల ముందే పంట ఎండిపోతుంటే కన్నీళ్లు ఆగడం లేదు. పదేండ్లలో ఎన్నడూ ఇట్ల లేకుండే. కేసీఆర్ సారు టైమ్‌కు రైతుబంధు ఇచ్చిండు. చెరువు నింపడంతో నీళ్లు పుష్కలంగా ఉండి పంటలు బాగా పండినయ్. ఇప్పుడు పంటలు ఎండిపోతున్నా సర్కారు పట్టించుకుంటలేదు. పంట కోసం పెట్టిన పెట్టుబడి ఎల్లే పరిస్థితి లేదు.

– వాంకుడోతు మారోణి, మహిళా రైతు, దయ్యంబండతండా, తుర్కపల్లి మండలం

పీఏపల్లి ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

- హాజరు కాని ఎంపీటీసీలు.. బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 30 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డిపై శనివారం పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మూడు నెలల కిందట తొమ్మిది సభ్యులు అవిశ్వాసం ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు విన్నవించడంతో ప్రతాప్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. దాంతో ఇంత కాలం వాయిదా పడింది. తిరిగి ఎన్నిక నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో శనివారం దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు సమక్షంలో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు ఎవరూ కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ ప్రకటించారు. మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలకు గానూ ఎనిమిది మంది టీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. ఇందులో నలుగురు ఇటీవల కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు ప్రతాప్‌రెడ్డికి మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్‌కు సరిపడా మెజారిటీ లేక ఆ పార్టీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. దాంతో ప్రస్తుత ఎంపీపీ ప్రతాప్ రెడ్డి పదవిలో కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అవిశ్వాసం వీగిపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేశాయి.

నాయకుడిగా కాదు.. సేవకుడిగా పని చేస్తా

ఆశీర్వదించండి.. మీలో ఒకడిగా ఉంటా

భువనగిరి పార్లమెంట్ అభివృద్ధికి అనునిత్యం కృషి

బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిశోర్, బీఆర్ఎస్ నేత రామకృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 30: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు డబ్బుల మీద ఆసక్తి లేదని, ప్రజలకు సేవ చేయాలనేదే తన అభిమతమన్నారు. తనను గెలిపిస్తే భువనగిరి పార్లమెంట్ పరిధిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పదవుల కోసం పాకులాడుతున్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత మళ్లీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. 2018లో తనకు ఇవ్వాల్సిన ఇబ్రహింపట్నం సీటును ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అమ్ముకోవడంతో తాను కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చానని, అప్పటినుంచి పార్టీ కోసం పనిచేస్తున్నానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజల కిచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2500, ఆసరా పింఛన్ రూ.4వేలకు పెంపు నేటికీ అమలుకు నోచలేదన్నారు. రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి డబ్బులు పడక పోవడంతో వారు అప్పులు చేసి పంటలు సాగు చేశారన్నారు. వెంటనే రైతుబంధును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ.కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, నాయకులు కంచి మల్లయ్య, పెంట నితీశ్ పాల్గొన్నారు.